క్లుప్తంగా

సేవలతోనే గుర్తింపు



రామ అప్పారావును సత్కరిస్తున్న స్వామి రామకృష్ణానంద

అగనంపూడి: ప్రజాసేవకు అంకితమైన వ్యక్తులకు సమాజంలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందని ఆధ్యాత్మిక గురువు స్వామీ రామకృష్ణానంద అన్నారు. అగనంపూడిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సమాచార హక్కు చట్టం ఉద్యమకర్త, ఉక్కు కార్మిక సంఘం నాయకుడు పట్టా రామ అప్పారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భీమిలి నరసింహస్వామి దేవస్థానం ప్రధాన నిర్వాహకుడు శ్రీమాన్ సింగరాచార్యులు, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు గుడే సుశీలా గజేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆరోగ్యానికి నిద్ర తప్పనిసరి



డాక్టర్ ఫణీంద్ర

అక్కిరెడ్డిపాలెం: మనిషి జీవితంలో నిద్ర ముఖ్య భాగం అని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ డాక్టర్ ఫణీంద్ర అన్నారు. మార్చి 17 ప్రపంచ నిద్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఒక మనిషి సగటు జీవిత కాలంలో 26 సంవత్సరాలు నిద్రకు, 7 సంవత్సరాలు నిద్రలోకి జారుకోవటానికి గడిపేస్తారన్నారు. నిద్రలేమి వల్ల హై బీపీ, గుండె సమస్యలు, షుగర్, ఊబకాయం, పక్షవాతం, మానసిక సమస్యలు వంటి వాటికి గురవుతారన్నారు. నిద్రకు సంబంధించిన వ్యాధులలో స్లీప్ అప్నియా అనేది ముఖ్యమైన సమస్య అన్నారు. నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్న వారు మంచి వైద్యుని సంప్రదించి, చికిత్సా మార్గాల ద్వారా సుఖనిద్రతో మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు.

ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

అల్లిపురం: ఆర్టీసీ బస్ ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వన్‌టౌన్ కొత్తరోడ్డు ప్రాంతానికి చెందిన అండిబోయిన కోటేశ్వరరావు (60) సిరిపురం జంక్షన్‌లో గల ఖరాచీవాలాలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో స్కూటీపై విధులకు బయలుదేరాడు. పూర్ణామార్కెట్ నుంచి సీపీ కార్యాలయం జంక్షన్ వైపు వస్తుండగా, 28వ నంబర్ ఆర్టీసీ బస్సు అతనిని బలంగా ఢీకొట్టడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయి. దీంతో ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో కలిసి ఆర్టీసీ బస్ సిబ్బంది గాయపడిన కోటేశ్వరరావును కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

త్వరలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి

సీతంపేట: రైతులు, చేనేత కళాకారులకు చేయూత నివ్వాలన్న సంకల్పంతో న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిస్ అండ్ మిసెస్ ఉత్తరాంధ్ర–2023 పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంచ నాగమల్లేశ్వరి తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్లు శుక్రవారం పౌరగ్రంథాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు ఏప్రిల్ 10వతేదీ లోగా 73370 97256, 73964 44404 ఫోన్ల నంబర్లకు సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. కన్స్యూమర్ రైట్స్ కమిషన్ నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయి రమేష్, రాష్ట్ర అదనపు కార్యదర్శి సురేష్‌నాయుడు, 2022 మిసెస్ ఉత్తరాంధ్ర విన్నర్ కొణతాల భాగ్య, మిస్ విశాఖ విన్నర్ గౌతమి, ఫౌండేషన్ డైరెక్టర్ సిద్ధు పాల్గొన్నారు.

కబ్జా కోరల్లో కృష్ణమహంతి చెరువు

- నీటి మీద రాతలా చెరువు అభివృద్ధి
- టీడీపీ హయాంలో పక్కదారి పట్టిన రూ.1కోటి నిధులు
- ఆక్రమణదారుల చెరలో 5 ఎకరాలు
- పట్టించుకోని అధికారులు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకకే తలమానికంగా ఉన్న 69వ వార్డు నాతయ్యపాలెంలోని కృష్ణమహంతి చెరువు అభివృద్ధికి నోచుకోక కళావిహీనంగా మారింది. 18 ఎకరాల విస్తీర్ణంలో నీటితో కళకళలాడుతూ ఉండే చెరువు నిర్వహణ లోపంతో గుర్రపు డెక్క చేరడంతో నిర్వీర్యంగా మారింది. కాదేదీ ఆక్రమణకు అనర్హం అన్నట్లు కబ్జాదారులు ఇక్కడ కూడా తయారవడంతో సుమారు 5 ఎకరాలకు పైగా వారి చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రస్తుతం చెరువు 13 ఎకరాలు మాత్రమే మిగిలిందని పలువురు గ్రామ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దారి మళ్లిన రూ.1కోటి నిధులు

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చెరువు అభివృద్ధికి సుమారు రూ.1 కోటి నిధులు మంజూరయ్యాయి. అయితే, నిధులు పక్కదారి పట్టాయని ఆరోపణలు ఉన్నాయి. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, నాతయ్యపాలెం నుంచి షీలానగర్‌కు చెరువు గట్టు పై రోడ్డు నిర్మాణం, ఫ్లడ్ లైట్ల నిర్మాణం, చెరువు గట్టుపై గార్డెన్స్ వంటివి ఏర్పాటు చేస్తామని భారీ ప్రణాళికను రూపొందించారు. కానీ పనులు కనీసం ప్రారంభించనైనా లేదు.

- కొందరు పెద్దలు చెరువును ఆక్రమించారని ఆరోపణలున్నాయి. ఆ స్థలాల్లో నిర్మాణాలు కూడా చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కబ్జాకు గురైన చెరువు స్థలాలను సర్వే ద్వారా గుర్తించి, స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



గుర్రపు డెక్కతో నిండిన కృష్ణ మహంతి చెరువు

చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి

ఈ చెరువు మా ఏరియాకు ల్యాండ్‌మార్క్‌లా ఉండేది. ఇప్పుడు కొంచెం కొంచెంగా ఆక్రమణదారులు ఆక్రమించేస్తున్నారు. అధికారులు చెరువుపై దృష్టి పెట్టాలి. సర్వే చేపట్టి, చెరువు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి. చెరువును అభివృద్ధి చేయాలి.

– సన్యాసిరావు, గ్రామ నాయకుడు, నాతయ్యపాలెం

చెరువును పరిరక్షించాలి

కృష్ణమహంతి చెరువు ఒక్క అంగుళం కూడా కబ్జాకు గురవకూడదు. ముందుగా చెరువును సర్వే చేసి, కబ్జాకు గురైన ప్రాంతాలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలి. అభివృద్ధి చేసి, రక్షణ కల్పించాలి.

– అప్పారావు, స్థానికుడు, నాతయ్యపాలెం

జెడ్జీ దృష్టికి సచివాలయ ఉద్యోగుల సమస్యలు



జెడ్జీ సింహాచలంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సచివాలయ ఉద్యోగులు

అక్కిరెడ్డిపాలెం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని విశాఖపట్నం జిల్లా డెమోక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయం ఎంప్లాయిస్ ప్రతినిధులు జెడ్జీ సింహాచలాన్ని కోరారు. ఆయన్ను శుక్రవారం కార్యాలయంలో కలిసి, వినతిపత్రం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు డి.ఎ.సూర్య మాట్లాడుతూ రెండో బ్యాచ్‌లో నియమితులైన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్లు ఖరారు చేయాలని, ఇతర గ్రామ, వార్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని జెడ్జీ తెలియజేశారని వారు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి జె.సమరం, ఈసీ మెంబర్లు మెనూ భూషన్, కె.పి.ఎస్.ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీఆర్‌లో ఇగ్నో రెగ్యులర్ సెంటర్ ప్రారంభం



ఇగ్నో సెంటర్ నిర్వాహకులకు ఉత్తర్వులను అందజేస్తున్న దృశ్యం

గాజువాక: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) రెగ్యులర్ సెంటర్‌ను స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో ప్రారంభించారు. ఈ మేరకు ఇగ్నో రీజనల్ సెంటర్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జి.ధర్మారావు ఇక్కడి సెంటర్ నిర్వాహకులకు ఉత్తర్వులను అందజేశారు. ఎంవీఆర్‌లోని ఇగ్నో సెల్ఫ్ స్టడీ సెంటర్‌ను రెగ్యులర్ సెంటర్‌గా మార్చడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు అనేక కోర్సులు అందుబాటులోకి వస్తాయని ఇగ్నో సెంటర్ కో ఆర్డినేటర్ ఎస్.వి.కృష్ణ తెలిపారు. బీఎస్సీ, బీఏ, బీకాం కోర్సులతో పాటు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో ఇంగ్లిష్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్, మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రవేశపెట్టినట్టు తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ–వాహన రంగంలో అవకాశాలు అపారం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ అరుణ్‌కుమార్

అగనంపూడి: ఈ వాహన రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని ఐఐటీ జమ్ము ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ వర్మ అన్నారు. దానిపై విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వాహనాలు, అవకాశాలు, అవరోధాలు అనే అంశంపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ రంగంలో అనేక దిగ్గజ బహుళ జాతి కంపెనీలు దృష్టి సారించాయని, రానున్నది ఈ వాహనాల యుగమని అన్నారు. అందుకే విద్యార్థులు ఆ దిశలో పరిశోధనలు చేయడం మంచిదన్నారు. ఈ రంగంలో వస్తున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి గల అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కో–ఆర్డినేటర్లు సుశాంత్‌కుమార్ సాహు, సీహెచ్.వి.రమణ, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో ‘స్వచ్ఛత పక్వాడా’



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేస్తున్న ఉన్నతాధికారులు, ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ డి.కె. మొహంతి, సీజీఎం (మెయింటెనెన్స్) సారంగి, మిల్స్ సీజీఎం యు. శ్రీధర్, సీజీఎం (సర్వీసెస్) ఎం.ఎస్.వి.కృష్ణయ్య, సీజీఎం (మైన్స్) సోట్టీ తదితరుల ఆధ్వర్యంలో బిల్డింగ్ పరిసరాలను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన స్వచ్ఛత పక్వాడా ప్రతిజ్ఞలో జీఎం (పీపీఎం) డాక్టర్ రమాదేవి, జీఎం (ఐఆర్) కె. సంజీవరావు, వర్క్స్ అడ్మిన్ అధికారి గోపీనాథ్‌తో పాటు బిల్డింగ్‌లోని పలు విభాగాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

భద్రతా విభాగం ఆధ్వర్యంలో ..

ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో సింటర్ ప్లాంట్ రహదారిలో స్వచ్ఛతా పక్వాడా నిర్వహించారు. ఈ నెల 28న జరగనున్న స్టీల్ సేఫ్టీ డే సందర్భంగా ఉదయం విభాగం అధికారులు, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు రహదారిలోని దుమ్ము, ఇసుక, స్లాగ్ లాంటి మెటీరియల్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో విభాగం జీఎం జె. రాజేంద్రన్, జోనల్ సేఫ్టీ ఆఫీసర్లు బయ్యే మల్లయ్య, మోహన్, సురేష్‌కుమార్, కృష్ణమూర్తి, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

డ్రై డే పాటిస్తే దోమలకు చెక్



అక్కిరెడ్డిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: వారంలో ఒకరోజు తప్పనిసరిగా డ్రై డే పాటించడం ద్వారా దోమలు రాకుండా నివారించవచ్చని ఆరోగ్య విస్తరణాధికారి ఎస్.ఎస్.వి.ఎస్.రాజు అన్నారు. డ్రై ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా 68వ వార్డు చినఅక్కిరెడ్డిపాలెంలోని సచివాలయ పరిధిలో ఆరోగ్య కార్యకర్తలతో కలిసి ప్రతీ ఇంటికి వెళ్లి, నీటి నిల్వలను పరిశీలించారు. నీరు నిల్వ ఉండటం వల్ల కలిగే దుష్ప్రయోజనాలను స్థానికులకు వివరించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు అబద్ధం, సీహెచ్.కె.మహాలక్ష్మి, ఆశ వర్కర్ లీలావతి, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా ఉరుసు ఉత్సవం



దర్గాలోని పూజల్లో పాల్గొన్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: హజరత్ బాబా సయ్యద్ మదీనా షా ఔలియా 66వ (ఉరుసు) వార్షికోత్సవం గాజువాకలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ రోడ్ జంక్షన్‌లోని దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి దర్గాను దర్శించుకున్నారు. దర్గా కమిటీ నాయకులకు, ముస్లిం మత పెద్దలు, యువకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఎండీ గౌస్, ముస్లిం నాయకులు దుబాయ్ బాషా, నన్ను, నసీర్, సాహిద్, బాషా, సమీర్, పర్వేజ్, కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

వేడుకగా అప్పన్న నిత్య కల్యాణం



యజ్ఞోపవీత ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపనే లక్ష్యం

- కార్పెంటర్ కుమారుడికి గేట్‌లో 13వ ర్యాంక్
- పేదరికాన్ని జయించి లక్ష్యాన్ని సాధించిన సాయి
- ఐఐఎస్సీ బెంగళూరులో చేరేందుకు ఆసక్తి



పండూరి సాయి

ప్రతిభకు పేదరికం అడ్డు కాదని మరోసారి నిరూపించాడు పండూరి సాయి. ఆర్థిక ఇబ్బందులను అధిగమించి, గేట్‌లో 924 మార్కులతో ఆలిండియా 13వ ర్యాంక్ సాధించాడు. ఐఐఎస్సీ బెంగళూరులో పీజీ చేసి, సాఫ్ట్‌వేర్ కంపెనీ స్థాపించడం లక్ష్యమని తెలిపాడు. ఇంటర్ పరీక్షకు ఫీజు కూడా కట్టలేని పరిస్థితుల నుంచి గేట్‌లో ర్యాంక్ సాధించేందుకు అతను పడిన తపన, చేసిన శ్రమ నేటి యువతకు స్ఫూర్తిదాయకం. సాయి విజయగాథ అతని మాటల్లోనే..

– సబ్బవరం

ప్రాథమిక విద్య ప్రభుత్వ పాఠశాలలోనే..

మాది ఆరిపాక శివారు పెదయాతపాలెం. మా నాన్న పండూరి వెంకటరావు వడ్రంగి. అమ్మ సరోజిని, గృహిణి. మేము ముగ్గురం సంతానం. నాకు ఒక అక్క, చెల్లి ఉన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు మా స్వగ్రామం పెదయాతపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నా. తర్వాత పదో తరగతి వరకు విశాఖలోని బంధువుల ఇంటి వద్ద ఉంటూ ప్రైవేట్ పాఠశాలలో చదివాను.

ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్‌లో చేరలేక.. టెన్త్ తర్వాత ఇంటర్ చదివేందుకు ఆర్థిక ఇబ్బంది కలిగింది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్‌లో డిప్లమో పూర్తి చేశాను. తర్వాత ఈ సెట్‌లో 8వ ర్యాంక్ సాధించి, ఆంధ్ర యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. పోటీ పరీక్షల ద్వారా ఉద్యోగం సాధించి, ప్రస్తుతం ఒడిశాలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో గ్రేడ్ 1 ఆఫీసర్‌గా పని చేస్తున్నాను.

టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదవాలని..

దేశంలోని టాప్ ఇన్‌స్టిట్యూట్‌లో చదవాలని లక్ష్యంగా పెట్టుకుని గేట్‌కు ప్రిపేర్ అయ్యాను. రోజుకు 14గంటలు ప్రిపేర్ అయ్యేవాడిని. అనుకున్నట్లుగానే మంచి ర్యాంక్ వచ్చింది. ఈ ర్యాంక్‌కు డీఆర్‌డీఏ, బార్క్, ఇస్రో వంటి సంస్థల్లో చేరవచ్చు. కానీ ఐఐఎస్సీ బెంగళూర్‌లో ప్రవేశం పొందడం ద్వారా నా కలను సాకారం చేసుకోవాలనుకుంటున్నా. ఎంటెక్‌లో వీఎల్ఎస్ఐ స్పెషలైజేషన్ చేసి, మంచి సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రారంభించడమే లక్ష్యం.

అమ్మ,నాన్నల కష్టాలను తీర్చాలి

అమ్మ, నాన్న పడిన ఇబ్బందులు చూస్తూ పెరిగాను. ఒక రకంగా మా ఆర్థిక ఇబ్బందులే నా పట్టుదలను పెంచాయి. ఎంత కష్టమైనా ఇష్టంతో చదివాను. ర్యాంక్ రాగానే అమ్మ, నాన్నలతో ఆ ఆనందాన్ని పంచుకున్నా. వారికి ఏ కష్టం లేకుండా చూసుకోవాలని కోరిక.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్ష శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆదినారాయణ

కూర్మన్నపాలెం: కార్మికుల జీవితాలను నాశనం చేసే ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 764వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను పేదల కడుపు కొట్టి మరీ బడా బాబులకు ధారపోస్తోందని విమర్శించారు. కోవిడ్ సమయంలో పేదలు ఎన్నో ఇబ్బందులు పడితే, అదే సమయంలో కార్పొరేట్ శక్తులు తమ సంపదను మరింత పెంచుకున్నాయన్నారు. నేటి ప్రభుత్వాలు సంపదను సృష్టించకుండా ప్రైవేటీకరణ పేరుతో సర్వనాశనం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వ పెద్దలు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

విద్యుత్ స్తంభాలపై లతల తొలగింపు



లతలు అల్లుకున్న విద్యుత్ స్తంభం



లతలు తొలగించిన అనంతరం విద్యుత్ స్తంభం

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ రోడ్డులో విద్యుత్ స్తంభాలకు దట్టంగా అల్లుకున్న పొదలను ఆర్‌ఈసీఎస్ సిబ్బంది తొలగించారు. ‘అల్లుకున్న లతలు.. అలముకున్న చీకట్లు’ శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మార్గంలో చాలా విద్యుత్ స్తంభాలకు పొదలు దట్టంగా అల్లుకోవడంతో వీధి దీపాల వెలుతురు కూడా నేలపై కనపడని పరిస్థితి ఉండేది. దీంతో ఈ మార్గంలో రాకపోకలకు ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. సాక్షిలో దీనిపై కథనాన్ని ప్రచురించడంతో ఆర్‌ఈసీఎస్ ఏఈ ఆధ్వర్యంలో సిబ్బంది స్పందించి, తుప్పలు తొలగించారు.

సాక్షి ఎఫెక్ట్..

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువుల ఆందోళన



హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుని బంధువులు, గ్రామస్తులు

అగనంపూడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన గొన్నా కళాశాల కార్యదర్శి గొన్నా హేమచంద్రనాయుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించి, అదే ప్రమాదంలో గాయపడిన అప్పలనాయుడిని సంఘటనా స్థలంలో వదిలేయడం వల్లే అతని ప్రాణాలు పోయాయని మృతుని బంధువులు ఆరోపించారు. ఈ విషయంలో మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ అగనంపూడిలోని టాటా కేన్సర్ ఆస్పత్రి సమీపంలోని సంఘటనా స్థలం వద్ద ఆందోళనకు దిగారు.

అగనంపూడి హోమీబాబా ఆస్పత్రి రహదారిలో మలుపు వద్ద గురువారం రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో అనకాపల్లి మండలం కోడూరు గ్రామశివారు భూపతిపాలేనికి చెందిన బొబ్బరి అప్పలనాయుడు (30) మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో గొన్నా కళాశాల అధినేత హేమచంద్రనాయుడి తలకు బలమైన గాయం కావడంతో ఆయన బంధువులు నాయుడిని వెంటనే నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఇదే ఘటనలో అప్పలనాయుడు తీవ్రంగా తాయపడి మరణించాడు. దీంతో అప్పలనాయుడిని సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉంటే బతికేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుని బంధువులు, గ్రామస్తులు ధర్నాకు దిగారు. నాయుడు కుటుంబ సభ్యులు సమస్య పరిష్కారానికి చొరవ తీసుకొని రూ.ఆరున్నర లక్షలు మృతుని కుటుంబానికి చెల్లించేందుకు అంగీకరించడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని అక్కడి నుంచి వారి స్వగ్రామానికి తరలించారు. ఈ విషయంలో గాజువాక ఏసీపీ టి.త్రినాథ్ సారథ్యంలో దువ్వాడ, పరవాడ సీఐలు బి.శ్రీనివాసరావు, ఈశ్వరరావు, ఎస్ఐలు పాల్గొని సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం

దొండపర్తి(విశాఖ దక్షిణ): టెక్ మహీంద్రా ఫౌండేషన్ వారి సహకారంతో నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి కల్పించనున్నట్లు నిర్మాణ్ సంస్థ డైరెక్టర్ మయూర్ పట్నాల తెలిపారు. ఇంటర్ పాస్, డిగ్రీ పూర్తయిన 18 నుంచి 28 ఏళ్లలోపు ఉన్న వారి అర్హులన్నారు. టైపింగ్ స్కిల్స్, ఎంఎస్ ఆఫీస్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, హెచ్‌టీఎంఎల్, సీఎస్ఎస్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్కిల్స్, బేసిక్ అకౌంటింగ్ స్కిల్స్ కోరులో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని వెల్లడించారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు ఎన్ఏడీ కొత్త రోడ్డు ప్రాంతంలో బాజీ జంక్షన్‌లో గల నిర్మాణ్ ఆర్గనైజేషన్ కేంద్రంలో కానీ 9502874304, 9908104113 ఫోన్ నెంబర్లకు ఈ నెల 18వ తేదీలోగా సంప్రదించాలని సూచించారు.

సింహాద్రి ఎన్టీపీసీ కృషి ప్రశంసనీయం



తాబేలు పిల్లలను సముద్ర జలాల్లోకి వదులుతున్న అటవీశాఖ అధికారులు

పరవాడ: ఆలివ్‌రిడ్లే తాబేళ్ల రక్షణకు సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం చేస్తున్న కృషి ప్రశంసనీయమని అనకాపల్లి అటవీశాఖ రేంజ్ ఇన్‌చార్జి పీవీ రవివర్మ అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఆర్థిక సహకారంతో ముత్యాలమ్మపాలెం తీరంలో పెంపకం కేంద్రంలో పొదిగించిన 150 ఆలివ్ రిడ్లీ తాబేలు పిల్లలను శుక్రవారం ఆయన సముద్ర తీరంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలీవ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు ముత్యాలమ్మపాలెం తీరంలో ప్రత్యేకంగా హేచరీ ఏర్పాటు చేశామన్నారు. సిబ్బంది ద్వారా తీరంలో 9570 తాబేళ్ల గుడ్లు సేకరించామన్నారు. వాటిని హేచరీలో 40–50 రోజుల పాటు పొదిగించి పిల్లలుగా మారిన తర్వాత సముద్రంలో విడిచిపెడతామని అన్నారు. హేచరీ సిబ్బంది వేతనాల మంజూరుకు జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని త్వరలో సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అనకాపల్లి అటవీశాఖ అధికారులు పి.జ్యోతిర్మయి, ఫారెస్టు సెక్షన్ అధికారి కె.కాశీప్రసాద్, ఈ.శివప్రసాద్ పాల్గొన్నారు.